# కొలెపు శివశేఖర్

# కలుపు మొక్క

హలో! సుబ్బారావు మీకు కనిపించాడా–?

సుబ్బారావు గురించి నేను చాలా కాలంగా వెతుకుతున్నాను.

కానీ– అతడు కనిపించలేదు.

మీకుగానీ– ఎప్పుడైనా, ఎక్కడైనా సుబ్బారావు కనిపిస్తే, దయచేసి నాకు తెలియజేయండి. నా చిరునామా మీకు తెలియకపోతే యీ కథ ప్రచురించిన పత్రిక ఆఫీసుకి తెలియపర్చండి.

ప్లీజ్. మర్చిపోరు కదూ?

సుబ్బారావు గురించి నేనెందుకు వెతుకుతున్నానో తెలియాలంటే– అతడి గురించి మీకు పూర్తిగా చెప్పక తప్పదు.

సుబ్బారావు నా ప్రాణమిత్రుడు. చిన్నప్పట్నించి కష్టాల్లో పుట్టి పెరిగాడేమో నిత్యం అతడి మొహంలో నైరాశ్యం తప్ప చిన్న చిర్నవ్వు కూడా గోచరించదు.

అస్థిపంజరానికి బట్టలు తొడిగినట్లుంటాడు. ఎవరో తల వెనుక వుండి ఆడిస్తున్న తోలుబొమ్మలా వుంటాడు. అతడి కళ్ళల్లో ఏవో భావాలు, మనసులో తెలీని ఆలోచనలు.

జీవితంపట్ల విపరీతమైన భయాన్ని పెంచుకున్నాడు సుబ్బారావు. ప్రతి చిన్న విషయాన్ని ఎక్కువగా ఆలోచిస్తూ వుంటాడు. ఒకోసారి తన మీద తనకే నమ్మకంలేనట్టు ప్రవర్తిస్తాడు.

సుబ్బారావు మీద నాకు ప్రేమకంటే జాలి ఎక్కువగా వుంది. అతడి ప్రవర్తన నాకు అసహ్యాన్ని కలిగించినా, అతడిని దూరంగా వుంచలేకపోయాను.

ఏడాది క్రితం సుబ్బారావుకి పెళ్ళి జరిగింది. అతగాడు అసలు పెళ్ళి చేసుకోనన్నాడు. నేను నచ్చచెప్పి బలవంతంగా ఒప్పించాను.

అతనికి వచ్చిన కట్నంతో – అతడి మొదటి చెల్లెలుకు పెళ్ళి చేయడం జరిగింది. ఇంకా ఇద్దరు చెల్లెళ్ళకు పెళ్ళి చేయవలసిన బాధ్యత అతడి మీద వుంది. అంతేగాదు - చదువుకుంటున్న ఇద్దరు తమ్ముళ్ళను, తల్లిని పోషించడమే గాకుండా ఇంటి చుట్టూ వున్న అప్పుల్ని కూడా అతడే తీర్చాలి.

సుబ్బారావు సంపాదన తిండికే సరిపోదని నాకూ తెలుసు. అతని పరిస్థితుల పట్ల జాలి పడుతూ మధ్య మధ్య నేనూ ఆర్థికంగా సహాయపడ్తూనే వున్నాను.

సమస్యల మధ్య నలిగిపోతున్నాడు సుబ్బారావు. ఆ సమస్యల్లోంచి అతడు బయటపడాలని ... అతని మొహాన్ని చిర్నవ్వుతో చూడాలని నేను తెగ ఆరాటపడేవాడ్ని.

ఓ రోజు—

సుబ్బారావు నాతో అన్నాడు—"నా భార్య ఎలా వుంటుందో నీవు చెప్పగలవా?"

ఈ హఠాత్ ప్రశ్న నాకు అర్థంకాక తికమక పడ్డాను.

"చెప్పు–నా భార్య ఎలా వుంటుంది?"

"ఎందుకలా అడుగుతున్నావ్?"

"నా ప్రశ్నకు సమాధానం కావాలి" తీక్షణంగా వుంది సుబ్బారావు గొంతు.

"చాలా గుణవంతురాలు......" ఇంకేం అనాలో తెలీలేదు నాకు.

"నేను అడిగేది బాహ్య సౌందర్యాన్ని గురించి."

"ఎలా వుంటుందో నీకు తెలీదా?"

"తెల్సు – నీకెలా వుంటుందో నాకు తెలియాలి."

"చాలా విచిత్రంగా అడుగుతున్నావ్?"

"నేనే పెద్ద విచిత్రాన్ని" అని పక పకా నవ్వేశాడు.

నేను చిరాగ్గా మొహం చిట్లించాను.

"చెప్పు నా భార్య అందంగా వుంటుంది కదూ?"

నేను మాట్లాడలేదు.

"నాకు తెలుసు నువ్వు సమాధానం చెప్పవని. నా భార్య అందంగా ఉంటుంది చాలా అందంగా వుంటుంది. ఆమెను చూసిన మగాడు మెదడు చెడగొట్టుకుంటాడని. అసభ్యకరమైన ఆలోచనలు ఆ మగాడిలో చోటు చేసుకుంటాయని నాకు బాగా తెలుసు."

"నీకేదో పిచ్చిపట్టింది సుబ్బారావు."

"ఇది పిచ్చికాదు. నేను నిజమే చెబుతున్నాను. అంతటి సౌందర్యవతికి, చీపురుపుల్లలా, అసహ్యంగా, అగ్లీగా ఉన్న నేను ఆమెకు భర్తను కావడం ఆమె దురదృష్టం. నువ్వు కాదంటావా?"

నేను మౌనంగా వుండిపోయాను. రాత్రి శకుంతలకీ, వీడికీ ఏదో గొడవ జరిగే ఉంటుందనుకున్నాను.

"ఆనాడే చెప్పాను నేను పెళ్ళి చేసుకోనని– నేను ఏ ఆడపిల్లకు భర్తగా తగను....ఆడవాళ్ళంటే మొదట్నుంచీ నాకు భయం....శకుంతలంటే మరీ భయం....భర్తగా ఆమె పక్కన నిలబడే అర్హత నాకు లేదు."

నేను అతడి వేపు చూస్తూ వుండిపోయాను.

"నీవు కూడా నన్ను మోసం చేశావ్...... శకుంతల లాంటి అందగత్తెకు. నాలాంటివాడు భర్తగా పనికిరాడని నీకూ తెల్సు....అయినా బలవంతంగా నన్ని పెళ్ళికి ఒప్పించావ్..... నిజం చెప్పు ఎందుకిలా చేశావ్....నా పెళ్ళయ్యాక, మా యింటికి నీ రాకపోక లెక్కువయ్యాయ్....నా పట్ల నీ సానుభూతి మరింత ఎక్కువయింది....నీకు....నీకు........శకుంతల మీద వ్యామోహం వుంది కదూ...?"

సుబ్బారావు చెంప పగిలిపోయింది.

కోపంతో నా కన్నులు ఎరుపుజీరల్ని అలుముకున్నాయి.

సుబ్బారావు ఒక్కక్షణం చెంప తడుముకొని బావురుమంటూ కూలబడి పోయాడు.

అతడి ఏడుపు వినాలనిపించలేదు. వేగంగా అక్కణ్ణుంచి వచ్చేశాను. సుబ్బారావులో ఏవో వికృత ఆలోచన్లు చోటుచేసుకుంటున్నాయని మొదటిసారిగా గ్రహించుకోగలిగాను.

ఆ తర్వాత– మరో వారం వరకూ సుబ్బారావు నాకు కలవలేదు. అతడి గురించి ఆలోచించడమే మానుకున్నాను. బజార్లో శకుంతల కనిపించినా పలకరించలేకపోయాను.

సుబ్బారావు చుట్టూ ఉన్న పరిసరాలే గాదు అతడి మెదడు కూడా యిరుకే– కానీ, యింత సంకుచితంగా ఆలోచిస్తాడని నేనెప్పుడూ అనుకోలేదు.

ఇంత కాలం అతడికి జీవితంపట్లే భయం అనుకున్నాను. కాల పెళ్ళాం పట్ల కూడా భయమే అని యిప్పుడే తెల్సుకోగలిగాను. తన చుట్టూ పరిధులు గీసుకొని ఆలోచించే మనుషులు ఒకోసారి ఎదుటి వాళ్ళను కూడ బాధపెడతారు.


ఈ వారం రోజులూ సుబ్బారావు ఏమైపోయాడో తెలీదు. ప్రతి రోజూ నన్ను కలుసుకోకుండా, నా సలహాలు తీసుకోకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని సుబ్బారావు– యిన్ని రోజులూ నాకు దూరంగా వుండగలగడం ఆశ్చర్యంగానే వుంది మరి.

అతడి యింటికి వెళ్ళాలని అనిపించినా ఎందుకో వెళ్ళలేక పోయాను.

ఓ రాత్రివేళ—

కాలింగ్‌బెల్ ఆగకుండా మోగుతుంటే మెలకువ వచ్చింది నాకు. వాచీ చూసుకుంటే సమయం రెండు గంటలు కావస్తోంది. ఇంత రాత్రివేళ నా కోసం ఎవరొచ్చారో అర్థంకాక నిద్ర కళ్ళతోనే, విసుక్కుంటూ వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా సుబ్బారావు అతని జుట్టు చిందర



వందరగా చెదిరిపోయివుంది. మొహం పీక్కుపోయి వుంది.

నేను కామ్‌గా వచ్చి కుర్చీలో కూర్చుండిపోయాను. సుబ్బారావు నా వెనుకే వచ్చి నాకు ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు.

నేను పెదవి కదపకుండా అతడ్నే చూస్తున్నాను. మళ్ళీ ఏదో ప్రళయం జరిగే వుంటుందనుకున్నాను.

''నా మీద ఆధారపడి చాలామంది బతుకుతున్నారు'' ఎటో చూస్తూ అన్నాడు సుబ్బారావు.

ఈ అసందర్భ సంభాషణ దేనికో నాకు అర్థం కాలేదు.

''ఎన్నో బాధ్యతలు నా నెత్తి మీద ఉన్నాయి.''

నేను వింటున్నాను.

''నేను హఠాత్‌గా చనిపోతే?''

ఉలిక్కిపడ్డాను.

''చెప్పు. నేను హఠాత్‌గా చనిపోతే నన్ను నమ్ముకున్న వాళ్ళందరూ ఏమైపోతారు?

''ఎందుకని వక్రంగా ఆలోచిస్తున్నావు?''

''నా ఆలోచనలు ఎప్పుడూ వక్రంగా ఉండవు. భవిష్యత్ గురించి ఖచ్చితంగా ఆలోచిస్తూనే వుంటాను. నేను చనిపోతే నా కుటుంబాన్ని పోషించేదెవరు? వయసులో ఉన్న నా చెల్లెళ్ళు, అందంగా ఉన్న నా పెళ్ళాం....వీళ్ళకి రక్షణ ఏది? నా తమ్ముళ్ళు, తల్లి ఏమవుతారు?''

చూడు సుబ్బారావ్. నీ ప్రశ్నలకు సమాధానం నా దగ్గర లేదు. అయినా నీవు ఇప్పుడే చనిపోతావని ఎలా అనుకుంటున్నావ్?''


''ఇప్పుడు కాకపోతే ఎప్పటికైనా చావవలసిందేగా–!''

''ప్రాణం వున్న ప్రతిదీ మరణించక తప్పదు.''

''ఆ మరణం నాకు ముందుగా రాదనే గ్యారంటీ ఏమిటి? అందుకే.... అందుకే.... నా బాధ్యతల పట్ల నేను తొందర పడుతున్నాను. నా చెల్లెళ్ళకు త్వరగా పెళ్ళిళ్ళు చేయాలి.... నా తమ్ముళ్ళు, తల్లి ఎవర్నీ యాచించకుండా ఏర్పాటు చేయాలి. అందుకు నేనేం చేయాలి?''

''ఏం చేయాలనుకుంటున్నావ్?''

డబ్బు సంపాదించాలనుకుంటున్నాను. అదొ



## పతి(వ్ర)త

క్రడుపు మండి
పడుపు వృత్తి చేపడితే
పతిత!
కన్నుగానక కామిస్తే
నాగరికత

-బండారు
లోగిళ్ళ

క్కడైటె నాకు చేతకాదు.''

నా తల గిర్రున తిరిగిపోసాగింది.

సుబ్బారావు ఏదో గొణుక్కుంటున్నాడు.

''సుబ్బారావు! నీ కుటుంబం గురించి పెద్దగా కలత చెందకు, నీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకు నా శక్తి మేరకు నీకు సహాయం చేస్తాను.''

''ఒరేయ్ ప్రాణ మిత్రమా. నేను కావాలనుకుంటే నీ సంపాదనంతా నా కాళ్ళ ముందు గుమ్మరిస్తావని తెల్సురా.... యిచ్చే విశాల హృదయం నీకున్నా, వూరికే తీసుకొనే చవటను కానురా నేను.''

''అయితే ఏమంటావ్'' చిరాగ్గా అన్నాను.

''నేను యిప్పుడే యీ క్షణంలోనే చనిపోయాననుకో నీవేం చేస్తావ్?''

''ఏం చేస్తాను....దగ్గరుండి దహన సంస్కారాలు జరిపిస్తాను.''

''ఆ తర్వాత ఏం చేస్తావు?

''ఏమి ఏం చేస్తావు?''

''అదే ఆ తర్వాత నా కుటుంబాన్ని నీవు...''

''తప్పక ఆదుకుంటాను.''

''ఏ ప్రతిఫలాన్నీ ఆశించకుండానే ఆదుకుంటావా?''

''అంతే?''

''నా చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు చేసి పంపిస్తావు, నా తమ్ముళ్ళని చదివిస్తావు, మా అమ్మ కూడా వాళ్ళతోపాటే బతికేస్తుందనుకో. మరి వయసులో వున్న నా పెళ్ళానికి తిరిగి మరో మొగుణ్ణి తీసుకు రాగలవా?''

''సుబ్బారావ్!''

''తీసుకురాలేవు. నీ కళ్ళ ఎదుటే ఆమె యవ్వనం, వయసు కాలానికి కృశించిపోతుంటే చూస్తూ ఊరికే ఉండలేక, ఆ తర్వాత నీవు ఆమెని చేరదీస్తావు. ఎవరికీ తెలీకుండా నాలుగు గోడలమధ్య, రహస్యంగా మీరిద్దరూ ఏకమై, మీ నెత్తురుని చల్లార్చుకుంటారు. ఇది తప్పక జరిగి తీరుతుంది.''

లాభం లేదు వీడికి నిజంగా పిచ్చెక్కింది. వీడి పిచ్చిమాటలు విన్న వాడికి కూడా పిచ్చెక్కే అవకాశం ఉంది.

''ఏమిటి ఆలోచిస్తున్నావ్- నా మాటల్లో యదార్థం వుంది కదూ?''

''సుబ్బారావ్. దయచేసి నువ్వుయిక్కణ్ణుంచి వెళ్ళిపోతావా?''

''వెళ్ళను.... ఇవాళ్ళ నీనుంచి పరిపూర్ణమైన సమాధానాలు కావాలి. ఈ మానసిక మధనాన్ని నేను భరించలేను. తేలుకొండెల్లాంటి నా ఆలోచనల్ని తట్టుకోలేను.... నాకు పిచ్చెక్కేలా వుంది''

''పిచ్చాసుపత్రికి ఫోన్ చేయమంటావా?''

''వద్దు... యింకా అంత అవసరం రాలేదు. చెప్పు నా కుటుంబం కోసం నేను ఏం చేయాలి? డబ్బు సంపాదించే మార్గం ఎలాగో చెప్పు.''

నేను మాట్లాడలేదు.

''నాకో వుపాయం తోస్తోంది.''

''ఏమిటది?''

''నీ దగ్గర కావల్సినంత డబ్బుంది.''

''ఆఁ....వుంది.''

''నా దగ్గర అందమైన పెళ్ళాం వుంది.''

''అ....వు....ను....ఉంది!''

''నా పెళ్ళాన్ని నీవు వుంచేసుకో-నా అవసరాలకు సరిపడినంత డబ్బు నా కిచ్చెయ్.''

ఒక్క క్షణం చైతన్యరహితుడయ్యాను. నా మెదడులో నరాలు దారాల్లా తెగిపోయినట్లనిపించాయి.

''నే చెప్పింది బావుంది కదూ?''

''యూ బాస్టర్డ్! మరో మాట మాట్లాడావంటే నీ నాలిక చీరేస్తాను. లేనిపోని భయాలతో.... అర్థంలేని ఆలోచనలతో నీ జీవితాన్ని తగలేసుకోకు....పో....వెళ్ళిపో....వెళ్ళిపో...''

''నేను తెలివి తక్కువగా మాట్లాడంలేదు... నే చెప్పేవన్నీ సత్యాలే...ఈ బాధ్యతల బరువుల్ని మోయలేను. ఈ సమస్యలోంచి బయటపడలేను. చాలినంత డబ్బు సంపాదించలేను.... అందుకే మొదలే నీకు చెప్తున్నాను. నా అసమర్థతను ఎక్కువ కాలం నా చెల్లెళ్ళు భరించలేరు. వాళ్ళు ఎప్పుడో ఒకప్పుడు ఎవరితోనయినా లేచిపోతారు. ఎక్కువ చదువులు చదవలేక, చదివిన చదువులకు సరైన ఉద్యోగాలు రాక తమ్ముళ్ళు జేబు దొంగలుగా మారే అవకాశం ఉంది. ఆర్థిక సమస్యలని తట్టుకోలేక నా పెళ్ళాం తన శరీరంతో వ్యాపారం చేయొచ్చు. భవిష్యత్‌ని ఖచ్చితంగా అంచనా వేస్తున్నాను. కనుకే నాలో ఈ విపరీతమైన ఆలోచనలు. ఈ నిజాలు నీకు అర్థం కావడంలేదు. నేనొక పిచ్చివాడిలా, వెర్రివాడిలా కనిపిస్తున్నాను నీకు'' తన రెండు చేతులతో జుట్టు పీక్కుంటూ అన్నాడు సుబ్బారావు.

వాడు ఎన్ని చెప్పినా అవన్నీవాడు ఊహించుకుంటున్న భయాలే అనిపించాయి. ఈ విపరీత ధోరణిలోంచి వాడు బయటపడాలి. ఎలా? ఎలా?

దాదాపు అయిదునిమిషాలవరకూ నిశ్శబ్దం.

కొద్దిసేపయ్యాక-''నువ్వు ఇంటికివెళ్ళు సుబ్బారావు అని అన్నాను.

''నా సమస్యల గురించి నువ్వు ఆలోచించవా?''

''ఇప్పుడు కాదు....''

''మరెప్పుడు-నేను చచ్చాకా?''

''ఇప్పుడు నన్నేం చేయమంటావ్?''


''అప్పుకోసం ఏదోక వస్తువును తాకట్టు పెట్టక తప్పదు కదా - నేనూహించే అనర్థాలు జరక్కముందే నా కుటుంబాన్ని కాపాడుకోవాలి. అంచేత నా పెళ్లాన్ని నీ దగ్గర తాకట్టు పెట్టేస్తాను.''

వీడికి సమాధానం చెప్పడం నావల్ల కాదు.

''నువు అంగీకరించకపోతే....''

''ఏమవుతుంది?''

''నా పెళ్లాం పది మంది మగాళ్ళకి భోగ



వస్తువుగా మారుతుందిరా.''

''అలా జరగదు.''

''జరుగుతుంది....దాని శరీరం రోగాలతో కుళ్ళిపోకముందే దాన్ని నేను కాపాడుకోవాలి. నీవు మిత్రుడివి కనుక దాన్ని స్వీకరిస్తావనే ఆశతో వున్నాను. ఇటు నా కుటుంబానికీ మేలు జరుగుతుంది-అటు నీ సమక్షంలో నా పెళ్లామూ సుఖపడుతుంది.''

మరో పది నిమిషాల వరకూ సుబ్బారావు ఏదో వాగుతూనే వున్నాడు. వాడి మాటలేవీ నేను తలకెక్కించుకోవడం లేదు. ఆఖరికి వాణ్ని బలవంతంగా బయటకు గెంటవలసి వచ్చింది.

ఆ తర్వాత- కొన్ని నెలలపాటు సుబ్బారావు నాకు కనిపించలేదు. తరుచూ అతడి గురించి నేను ఆలోచిస్తూనే వున్నాను, ఈ పిచ్చివాడు ఏమైపోయాడని. ఈ మధ్య కాలంలో బజార్లో శకుంతల కూడా నాకు కనిపించలేదు.

వాడి గురించి ఏ విధమైన సమాచారం నాకు తెలీడం లేదు. వాడి వునికిని మర్చిపోలేక.... రెండుమూడు సార్లు వాడు పనిచేస్తున్న ఆఫీసుకు ఫోన్ చేశాను. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫోన్‌లో వాడు దొరకలేదు. కావాలనే వాడు నానుంచి తప్పించుకుంటున్నట్లనిపించింది.

ఓ రోజు వుండబట్టలేక సుబ్బారావు ఇంటికి వెళ్ళాను. వాడు యింట్లో లేడు. నన్ను చూసి శకుంతల తలుపుచాటుకి తప్పుకుంది. పెళ్ళి కావల్సిన ఆడపిల్లలిద్దరూ దూరంగా నిలబడి నా వేపు దీనంగా చూస్తున్నారు.

సుబ్బారావు తల్లి కన్నీళ్ళు పెట్టుకుంటూ చాలా విషయాలు చెప్పింది.

సుబ్బారావు ఈ మధ్య ఎక్కువగా ఇంటి పట్టున వుండడం లేదట. ఏ అర్ధరాత్రులో ఇల్లు చేరుకోవడం - భార్యతో ఏ విషయమో తగవు పడడం - మిగిలిన కుటుంబ సభ్యులతో సరిగ్గా మాట్లాడక పోవడం .... ఇంకా చాలా చాలా విషయాలు అతని గురించి తెలిశాయి.

సుబ్బారావు రాగానే నన్ను కలవమని చెప్పి- కొంత డబ్బు ఆ తల్లి చేతికి ఇచ్చి వచ్చేశాను.

అయినా సుబ్బారావు నన్ను కలవలేదు.

మరికొన్ని రోజులు గడిచిపోయాయి.

మళ్ళీ ఓ అర్ధరాత్రి వేళ కాలింగ్ బెల్ ఆగకుండా మోగింది.

ఆ వచ్చింది సుబ్బారావే అనుకున్నాను.

ఏమైనా ఈసారి వీణ్ని వదలకూడదు. వీడి బలహీనతల్ని భయాల్ని పోగొట్టాలి. వీడి వెర్రిమొర్రి ఆలోచనలకి అడ్డుకట్ట వేయాలి.

ఓ స్థిరమైన నిర్ణయానికి వచ్చి, వెళ్ళి తలుపు తీశాను.

ఆశ్చర్యం !

స్థంభించిపోతూ ఒక్క అడుగు వెనక్కి వేశాను.

ఎదురుగా గుమ్మంలో శకుంతల-

ఈ అర్ధరాత్రి పూట వంటరిగా, నిర్భయంగా ఆమె ఎలా రాగలిగిందో అర్థం కాలేదు. ఆమె ధైర్యానికి మెచ్చుకోవాలో, ఆమె యిలా వచ్చినందుకు మందలించాలో నాకు తెలీలేదు.

''లోపలికిరా శకుంతలా'' అన్నాను.

ఆమె భుజాన్నిండా పైట కప్పుకొనుంది. ఆమె మొహంలో భావాలు సరిగా అర్థం కావడం లేదు. తల వొంచుకొని లోపలికి వచ్చింది.

''కూర్చో'' అన్నాను.

ఆమె కూర్చుంది.

ఎదురుగా వున్న కుర్చీలో నేనూ కూర్చున్నాను.

రెండు నిమిషాల వరకూ ఎవ్వరం మాట్లాడుకోలేదు.

ఆ తర్వా —'' చెప్పు శకుంతలా....ఏం జరిగిందో? అన్నాను.

## దూరం

అవసరాలు-
ఆశయాలూ
ఆకాశంలో
విహరిస్తుంటే-
అవకాశాలు
ఆచరణలూ
అధఃపాతాళంలో
నిద్రిస్తున్నాయ్ !!

—ప్రతాప చంద్ర
హైదరాబాద్

శకుంతల నా వేపు తలెత్తి చూసింది. ఆమె పెదవులు చిన్నగా కంపిస్తున్నాయి. గుండె లోంచి తన్నుకొస్తున్న దుఃఖాన్ని పెదవుల మధ్య నొక్కి పెట్టడానికి ప్రయత్నిస్తోందని తెలుస్తూనే వుంది.

మరలా ఓ నిమిషం ఆగి అన్నాను— ''సుబ్బారావు మళ్ళీ ఏమైనా పిచ్చి పనులు చేశాడా?''

''నేను....నేను....ఆయనతో కాపురం చేయలేను'' జల జలా ఆమె కన్నుల్లోంచి కన్నీళ్ళు జాలు వారాయి.

''ఏం....ఎందుకు....ఎందుకని....?''

''ఆ నరకాన్ని నేను భరించలేను.''

''వివరంగా చెప్పు.''

''ఆయన....నన్ను తార్చడానికి ప్రయత్నిస్తున్నారు.''

ఓ భయంకరమైన పిడుగు నా తలమీద పడింది. అప్రయత్నంగా నా కండరాలు బిగుసుకున్నాయి. ఆ క్షణంలో సుబ్బారావు నా కళ్ళ ఎదుట వుంటే ముక్కలు ముక్కలుగా నరికేసేవాణ్ని.

''చాలా కాలంగా ఆయన నన్ను వేధిస్తున్నారు. తన కుటుంబ శ్రేయస్సుకోసం.... డబ్బు సంపాదన కోసం.... నేను పడుపువృత్తి చేయాలట.... అందుకు నేను అంగీకరించలేదు. ....ఫలితంగా....'' గభాల్న ఆమె భుజాలపై వున్న పైటను, ఎదపై వున్న జాకెట్‌ను తొలగించింది.

చూడలేక పోయాను.

ఆమె వీపు మీద ఎర్రని గాట్లు- ఎదమీద సిగరెట్‌తో కాల్చిన గాయాలు.... కళ్ళు మూసుకున్నాను.

''ఇలా చూపించడానికి నేను సిగ్గుపడడం లేదు.... ప్రతి రోజూ నాకీ నరకం తప్పడం లేదు.... మరో భయంకరమైన నిజం ఏమిటంటే నాకు పెళ్ళయినా నేనింకా కన్యనే....''



అప్రతిభుడ్నయ్యాను. నా మెదడు లోగిళ్ళల్లో ఏవో ఘోషలు వినబడుతున్నాయి. నా గుండె దయాస్‌పై సుబ్బారావు నపుంసకుడై వికృతంగా నర్తిస్తున్నాడు.

"నా అందానికి తాను తగినవాడిని కాదేమో ననే ఆయన పిరికితనం. ఒకోసారి నన్ను రెచ్చగొట్టి, బాధపెట్టి ఆనందించే శాడిజం ఆయనలో చాలా ఉంది. ఇవన్నీ పరాయి మగాడికి చెప్పుకో లేని విషయాలు. కానీ మీరు మంచివారు,ఆయనకి ఆప్తులు. నన్ను అర్థం చేసుకునే విశాల హృదయం మీకుందనే నమ్మకంతో సిగ్గు విడిచి ఇవన్నీ చెప్పగలిగాను. దయచేసి నన్ను ఆ నరకంలోంచి తప్పించండి" ఆమె వెక్కి వెక్కి ఏడ్చేయసాగింది.

నా మెదడంతా పాడయిపోయింది.

అక్కడ్నించి లేచి కిటికీ దగ్గరకు వచ్చి నిలబడ్డాను.

బయట వెన్నెల విరగగాస్తోంది.

ఆ వెన్నెలలో ఓ ఆకారం వడివడిగా గేటు దాటి వెళ్ళి పోవడం నా కంటబడింది. ఆ ఆకారం సుబ్బారావే అని గుర్తించడానికి నాకు ఎక్కువ సమయంపట్టలేదు.

కిటికీ చాటు నుండి వాడు అన్నీ విన్నాడని తేలిగ్గానే ఊహించుకోగలిగాను.

ఆమె ఇంక ఏడుస్తూనే వుంది.

ఆ రాత్రంతా అనే గురించే ఆలోచిస్తూ గడిపేశాను.

ఆ తెల్లారి శకుంతల్ని తీసుకొని లాయర్ దగ్గరకు వెళ్ళాను.

కానీ– చాలా ఆలస్యంగా తెల్సిన విషయం ఏమిటంటే సుబ్బారావు ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఆ యింటి లిపాదీ చాలా రోజులు వాడి గురించి ఏడ్చారు. ఈ కథ ముగించబోయే ముందు– సుబ్బారావు యీ కథ చదివితే పర్వాలేదు. లేకపోతే వాడికీ క్రింది విషయాలుచెప్పండి.

సుబ్బారావు చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు చేశానని, వాడి తమ్ముళ్ళు మంచి ఉద్యోగాలు చేస్తున్నారని, శకుంతలకు మరో పెళ్ళి జరిగిపోయిందని, వాడి తల్లి మరణించిందని .... దయచేసి వాడికి తెలియజేయరండి.

లేకుంటే—

ఆ దౌర్భాగ్యుడు, నికృష్టుడు, చవట, వెధవ ఎక్కడున్నా, ఎలా వున్నా నాకు తెలియపర్చడం మాత్రం మర్చిపోకండి. *


## జ్యోతిషం

* సమస్యలు జీవితాన్ని సంచలనాత్మకం చేస్తాయి. మీ భవిష్యత్‌ను ఆధునిక శాస్త్రీయ పద్ధతులలో తెలుసుకోవడానికి "ఎస్ట్రాలజికల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్, 18, జర్నలిస్టు కాలనీ, హైదరాబాద్-34 కు రాయండి. ఫోన్ : 38570


# వెనుతిరిగి చూదాం వెన్నెలలు కందాం

## ఒకనాటి మన ఆస్థానకవి కాశీ కృష్ణమాచార్యులు

ఒక రాష్ట్రానికి ఆస్థాన కవులంటే, నిస్సందేహంగా వారు మహా విద్వాంసులు, పండితులు, పుంభావ సరస్వతులు అయి వుంటారు. ఇందులో డౌటెవరికీ వుండదు.

అయితే, కాశీ కృష్ణ మాచార్యుల వారు ఇటు కలంతో కవితా సేద్యం, అటు హలంతో పొలాల సేద్యం చేసి, అపర పోతనగా అలరించేరు. అంతేకాదు, వారు సకల వాద్య కళాకారులు కూడా. చతుష్షష్టి కళలలో చతురులు వీరు. అంతేనా, వజ్రంగం, కమ్మరం, కుమ్మరం, నేత, ఈత, వంటకం, వ్యాయామం, కుస్తీ, బస్కీ, గారడీ, సాము విద్యలు కూడా ఔపోసన పట్టేరు. ఈ కలయిక దాదాపు అసంభవంగా తోస్తుంది. చాలా అరుదుగా కనిపిస్తుంది గానీ, ఇది ప్రత్యక్షర సత్యం.

అవధాన శిరోమణి, పౌరాణిక రత్న, విద్యావార్థి, తర్క విద్య దుభయ కవి మిత్రుడు, మొదలైన బిరుదాలతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల చేత అఖండ సన్మానాలు అందుకున్నారు కృష్ణమాచార్యులు.

అరగంటలో శతమానానికి మించిన పద్యాలను ఆశువుగా చెప్పిన అనన్య సామాన్య శక్తి సమన్వితుడు ఈ కవి పండితుడు.

పది వసంతాలు ఇంకా నిండీ నిండకుండానే, నిండుకుండ లాంటి గంభీరంతో పద్యాలు చెప్పారు. రెండు పదులు దాటకుండానే, ఇంటి గడపనేకాదు, రాష్ట్ర గడపను కూడా దాటి అనేక ఇతర రాష్ట్రాలలో కాలూని, కవితా ప్రసంగాలు చేసి. అవధాన జైత్రయాత్ర చేశారు.

ఆంధ్ర సంస్కృతోపాధ్యాయులుగా పనిచేసిన వీరు, ఒక చిన్న సంఘటనతో, ఉద్యోగానికే ఉద్వాసన చెప్పారు. తన తండ్రి అద్దిశానికి పాఠశాల వారు శలవు ఇవ్వకపోవడంతో, చివ్వున లేచి వచ్చేసి, మరి పాఠశాల కేసి పోలేదు. ఈ పని నేటి మనకు చాదస్తంగా కనిపించినా, వారి పద్ధతి అది.

కాశీ కృష్ణమాచార్యుల వారి సంస్కృత ఘనాపాఠీ తత్వానికి ముగ్ధులై, జర్మన్ పండితులు తమ దేశానికి ఆహ్వానించారు. అది ద్వితీయప్రపంచ యుద్ధ రణ భేరీలు మ్రోగుతున్న రణనినాద సమయం. అప్పటికే వృద్ధాప్యపు ఛాయలు వారిలో ముసురుకుని వున్నాయి. తెల్లని గుబురు గడ్డం వెనుక నుంచి చల్లని నవ్వులు చిందిస్తూ, "ఈ వయసులో ఈ కర్మణ్య దేశం వదలి, మీ శర్మణ్య దేశం రాలేను–" అన్నారట.

సంస్కృతం వారి ఊపిరి. విమానాల్లో కూడా తిరిగి, సర్వే సర్వత్రా ఈ గీర్వాణ భాషా ప్రచారం చెయ్యాలనేది వారి ఆశ. అది "పిచ్చి ఆశ" అని వారే అంటూండేవారు. "అవర్ సైన్స్ వేర్ వెస్టర్న్ బిగిన్స్ సైన్స్ ఎండ్" అంటారు ఆచార్యుల వారు.

"ఓం" అంటే ప్రపంచం అని వారు విశ్లేషించిన అర్థం, ఈ శీర్షికతో, తన శతమాన జీవితానుభవాలను లిపిబద్ధం చేయాలనేది వారి ఆశ. అయితే, అది అసంపూర్ణంగానే మిగిలిపోయింది. వారు దేహం చాలించారు.

సంవత్సరానికి వెయ్యి చొప్పున వారి వయసుకు దీటుగా (నూరేళ్ళు) వందవేల (లక్ష) రూపాయల విరాళం ప్రోగుచేసి, వారికి నిధిగా సమర్పించాలన్న వారి శిష్య కోటి కోరిక శారికయై మింటి కెగసింది.

—దేవరాజురవి

హైదరాబాద్




పల్లకి సచిత్ర వార పత్రిక ఏప్రిల్ 3, 1986

41